# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్ర చరిత్రలో తొలిసారి ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా ప్రకటిస్తామని విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ లో నాసిరకం మద్యం విక్రయించే దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.
- ❖ జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదన ప్రభుత్వం వద్ద లేదని మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు.
- ❖ రాష్ట్ర వ్యాప్తంగా చేనేత శాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత వెల్లడించారు.
- ❖ "ఒక దేశం - ఒక ఖనిజం - ఒక పన్ను" విధానాన్ని అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నట్టు నీతి ఆయోగ్ సభ్యుడు వి.కె. సారస్వత్ పేర్కొన్నారు.

============================

ఒక తరగతి – ఒక ఉపాధ్యాయుడు విధానాన్ని రాష్ట్రంలో 10 వేల పాఠశాలల్లో అమలు చేస్తామని విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఈ రోజు మంత్రి శాసనసభలో మాట్లాడుతూ... రాష్ట్ర చరిత్రలో తొలిసారి ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా ప్రకటిస్తామని, వారి బదిలీల కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామని వెల్లడించారు. విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్నారు. విద్యార్థులకు బ్యాగు బరువు తగ్గించేలా సంస్కరణలు తీసుకొస్తున్నామని, వారికి నాణ్యమైన యూనిఫామ్ ఇస్తున్నామని లోకేష్ పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

============================

“ఒక దేశం - ఒక ఖనిజం - ఒక పన్ను” విధానాన్ని అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నట్టు నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (NITI) నీతి ఆయోగ్ సభ్యుడు వి.కె. సారస్వత్ తెలిపారు. ఈ రోజు విజయవాడలో మైనర్ మినరల్స్ ఇండస్ట్రీ సమాఖ్య (FEMMI), నీతీ ఆయోగ్, గనుల మంత్రిత్వ శాఖ సహకారంతో మైనర్ మినరల్ మైనింగ్‌లో అవకాశాలు, సవాళ్లపై జాతీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వి.కె.సారస్వత్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహ్ అనేక రాష్ట్రాల్లో మైనింగ్ పరిశ్రమ బహుళ సవాళ్లను ఎదుర్కొంటున్నందున పన్ను విధింపులో సంస్కరణలు అవసరం అన్నారు. అక్రమ మైనింగ్‌ను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరమని ఆయన పేర్కొన్నారు.

=============================

రాష్ట్ర వ్యాప్తంగా చేనేత  శాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. ఈ రోజు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలలో చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సభ్యులు అడిగిని ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. చేనేత అభివృద్ధికి 2014-19 నాటి పథకాలను మరోసారి అమలు చేయనున్నామని తెలిపారు. జాతీయ గ్రామీణ జీవనోపాధి పథకంలో భాగంగా సెర్ప్ ఆధ్వర్యంలో 120 కోట్ల రూపాయలతో చేనేత కార్మికులకు ఆర్థికాభివృద్ధిని అందించనున్నామని స్పష్టం చేశారు. చేనేతలకు ఊతం ఇచ్చేందుకు ఉచిత విద్యుత్ కోసం బడ్జెట్ లో 200 కోట్ల రూపాయలు  కేటాయించామని తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో బీసీలకు అత్యంత ప్రాదాన్యత అందుతోందని మంత్రి సవిత తెలియజేస్తూ...

(వాయిస్ 37 సెకన్లు)

=============================

జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదన ప్రభుత్వం వద్ద లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. జిల్లాల పున:వ్యవస్థీకరణపై ఈ రోజు శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. బాపట్ల, చీరాల, రేపల్లె  రెవెన్యూ డివిజన్లను సవరించి, అద్దంకి కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం బాపట్ల జిల్లా కలెక్టర్ నుండి ప్రతిపాదన వచ్చిందని వివరించారు. మడకశిరను కొత్త రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనను శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి సమర్పించారని తెలిపారు. అలాగే ఎమ్మిగనూరు, ఉదయగిరి రెవెన్యూ డివిజన్లుగా మార్చాలని ప్రతిపాదనలున్నాయని మంత్రి తెలియజేశారు.

విరామం

=============================

గ్రామాల్లో ఉండే కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్స్ కు 15 వేలు ప్రోత్సాహకం ఇచ్చే ప్రయత్నం చేస్తున్నామని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లపై ఈ రోజు శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో  10 వేల 032 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల నిర్మాణం చేపట్టగా  3 వేల 015 కేంద్రాల నిర్మాణం పూర్తయ్యిందని, కొన్ని పురోగతిలో ఉన్నాయని ఆయన తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ విద్య పూర్తి చేసిన వారినే కమ్యునిటీ హెల్త్ ఆఫీసర్లుగా నియమించామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

=============================

రాష్ట్రంలో  నాసిరకం మద్యం విక్రయించే  దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. ఈ రోజు శాసన మండలిలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి  సమాధానం నమిస్తూ... ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదులపై విచారణ  చేసి 15 షాపుల లైసెన్సులు రద్దు చేశామని తెలిపారు. నాసిరకం మద్యం అమ్ముతూ పట్టుబడితే మొదటి  సారి  5 లక్షల రూపాయల జరిమానా విధిస్తామని, రెండో సారి పట్టుబడితే లైసెన్సులు రద్దు చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

==============================

జన ఔషధి దుకాణాల పట్ల ప్రజలు అపోహలు తొలగించుకోని, వాటిని వినియోగించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఔషధ నియంత్రణ పరిపాలన సంచాలకులు ప్రసాద్ కోరారు. ఈ రోజు జనఔషధి దినోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లాలో రెండు జన ఔషధి దుకాణాలకు ప్రోత్సాహక బహుమతులు ఆయన అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం 50 నుండి 90 శాతం తక్కువ ధరలకు ఈ దుకాణాల ద్వారా మందులను అందిస్తుందని తెలిపారు. జనరిక్ మందులపై అవహగన కల్పించడం జనఔషధి దినోత్సవ ప్రధాన ఉద్దేశ్యమని ప్రసాద్ తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

==============================

రాష్ట్రంలో రాజీవ్ స్వగృహ కింద చేపట్టిన ప్రాజెక్టు మొత్తం 571.69 ఎకరాల్లో కొనసాగుతుందని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. రాజీవ్ స్వగృహ కింద చేపట్టిన ప్రాజెక్టుల గురించి అసెంబ్లీలో మంత్రి నారాయణ ఈ రోజు మాట్లాడారు. అనంతపురం, కర్నూలులో ఈ ప్రాజెక్ట్ పూర్తి కాగా, మిగిలిన చోట్ల ఇంకా పూర్తి కావలసి ఉందని అన్నారు. పూర్తి కాని ఇళ్లను రద్దు చేస్తే న్యాయపరమైన సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రాజెక్ట్ అమల్లో ఉన్న నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. విశాఖపట్నంలో టీడీఆర్ బాండ్ల అక్రమాలపై విజిలెన్స్, సీఐడీ విచారణ విచారణ చేయిస్తామన్నారు. మూడు నెలల్లోపు వీటి అక్రమాలపై పూర్తి స్పష్టత ఇస్తామని మంత్రి తెలిపారు.

==============================

నాగార్జున సాగర్ ప్రాజెక్టు నీటిలో రాష్ట్ర వాటాను వృథా చేయకుండా కాల్వలపై ఆధార పడి సాగు చేస్తున్న ప్రతి ఎకరాకూ నీరు అందించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. ఈ రోజు కలెక్టర్ సమావేశ మందిరంలో రబీ సాగు, వేసవి తాగు నీటి సరఫరాకు నాగార్జున ప్రాజెక్టు నీటి వినియోగంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ, సాగర్ ప్రాజెక్టు అధికారులు సమన్వయం చేసుకుని ప్రాజెక్టులో నీటిని రైతులందరూ న్యాయబద్ధంగా వినియోగించుకునేలా చూడాలని సూచించారు. మార్చి నెలాఖరు వరకూ రైతులకు సాగు నీరు అందించేందుకు, ఏప్రిల్ లో తాగునీటి వినియోగం కోసం ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

==============================
==============================